
సాక్షి ఒడిశా

బుధవారం । 1 । మే । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,02,463లు, వచ్చాయని అధికారులు తెలిపారు.



జోరుగా.. నామినేషన్లు

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి రాష్ట్రంలో మరో విడత పోలింగ్‌కు మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున నామినేషన్లు దాఖలయ్యాయి.

- 8లో



ఓటు హక్కుపై అవగాహన

స్వీప్ కార్యక్రమం ద్వారా ఓటుహక్కుపై అవగాహన కల్పించేందుకు కొరాపుట్ జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది.

- 8లో

న్యూస్‌రీల్

దివ్యాంగుల్లో ఓటు స్ఫూర్తి



ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న దివ్యాంగులు

భువనేశ్వర్: సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ శాతం గణనీయంగా పెంపొందించాలని ఎన్నికల సంఘం యోచిస్తుంది. ఈ దిశలో పలు చైతన్య, అవగాహన కార్యక్రమాలు చేపడుతుంది. కెంజొహర్ జిల్లా ఎన్నికల అధికారి (డీఈఓ) ఆధ్వర్యంలో దివ్యాంగ ఓటర్ల అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ వర్గం ఓటర్లు చురుగ్గా పాలుపంచుకునేందుకు పోలింగ్ కేంద్రాల ప్రాంగణాల్లో కల్పించిన ప్రత్యేక సౌకర్యాలు, తదితర సమాచారం పట్ల అవగాహన కల్పించారు. వీరి భాగస్వామ్యం ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలక స్థానం కలిగి ఉందని ప్రేరేపించారు. స్టార్ అథ్లెట్లు భానుమతి బెహెరా, అభయ కుమార్ జెనా, పలువురు దివ్యాంగులతో నిర్వహించిన చైతన్య కార్యక్రమంలో అధిక సంఖ్యలో ఓటు వేయడంపట్ల దివ్యాంగుల్లో స్ఫూర్తిని నింపారు. మీ భాగస్వామ్యం ద్వారా మన ప్రజాస్వామ్యాన్ని శక్తివంతం చేయడం సులభతరం అవుతుందని దివ్యాంగ ఓటర్లకు పిలుపునిచ్చారు.

'రాహుల్ గాంధీ సభను విజయవంతం చేయండి'



ప్రచారం నిర్వహిస్తున్న సప్తగిరి, సత్యజీత్, శివగాడో తదితరులు

రాయగడ: మే 3వ తేదీన రాయగడలో నిర్వహించనున్న రాహుల్ గాంధీ సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. ఈ మేరకు జిల్లాలోని గుణుపూర్‌లో సోమవారం సాయంత్రం మారథాన్ ప్రచారాన్ని నిర్వహించారు. కొరాపుట్ లోక్‌సభ స్థానం నుంచి మరోసారి పోటీ చేస్తున్న సప్తగిరి శంకర్ ఉలక, గుణుపూర్ శాసనసభ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న సత్యజీత్ గొమాంగోతో పాటు పార్టీకి మద్దతు ప్రకటించిన గుణుపూర్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ శివప్రసాద్ గాడో, సీనియర్ కార్యకర్తలు, నాయకులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. మెయిన్ రోడ్డు మీదుగా వీరంతా నడుచుకుంటూ గుణుపూర్ ప్రాంత వాసులకు అభివాదం చేస్తూ పార్టీకి మద్దతివ్వాలని కోరారు. అనంతరం జరిగిన సభలో సప్తగిరి మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేడీ, కేంద్రంలో బీజేపీలు ప్రజలను దోచుకుంటున్నాయని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రజలు మేల్కొని కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలని కోరారు. కేంద్ర, రాష్ట్రాల్లో ప్రజలకు సుస్థిరమైన పాలనను అందించే సత్తా కాంగ్రెస్‌కు మాత్రమే ఉందన్నారు. బీజేడీ, బీజేపీ పార్టీలను ఎండగట్టేందుకు మే 3వ తేదీన రాహుల్ గాంధీ రాయగడకు రానున్నారని, అక్కడ జరగనున్న బహిరంగ సభలో అంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

విమానాశ్రయంలో రూ.75 లక్షల నగదు స్వాధీనం



విమానాశ్రయంలో నిర్వహించిన తనిఖీల్లో బయటపడిన నోట్ల కట్టలు

భువనేశ్వర్: స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం (బీపీఐఏ)లో రూ.75 లక్షల నగదు జప్తు చేశారు. న్యూఢిల్లీ, చెన్నై నుంచి వచ్చిన ఇద్దరు వ్యక్తుల నుంచి ఈ నగదు స్వాధీనపరచుకున్నట్లు విమానాశ్రయం అధికారులు తెలిపారు. ప్రయాణికుల ఆచూకీ వివరాలు స్పష్టం కావలసి ఉంది. విచారణ కోసం అధికారులు ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. ఎయిర్‌పోర్టులో ప్రయాణికుల లగేజీని పరిశీలిస్తుండగా నగదును గుర్తించారు. దీనిపై ఆరా తీయగా సందిగ్ధత బలపడడంతో స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఢిల్లీ నుంచి వచ్చిన ఓ ప్రయాణికుడి బ్యాగ్‌లో రూ.50 లక్షలు, చెన్నై నుంచి భువనేశ్వర్‌కు వచ్చిన మరో ప్రయాణికుడి నుంచి రూ.25 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఆదాయపు పన్ను శాఖ అధికారులు నగదును స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టారు. నగదు ఎక్కడిది అనే దానిపై ఐటీ అధికారులు ఆరా తీస్తున్నారు. రాష్ట్రంలో త్వరలో జరగనున్న ఎన్నికలకు ముందు ఒడిశాలోని పలు ప్రాంతాల్లో భారీగా నగదు పట్టుబడింది. ఇప్పటివరకు విమానాశ్రయంలో నగదు స్వాధీనం కావడం ఇదే మొదటిసారి.

డబుల్ హ్యాట్రిక్ దిశగా..!



భువనేశ్వర్: నామినేషన్ దాఖలు చేస్తున్న సీఎం నవీన్ పట్నాయక్

- హింజిలికాట్‌లో సీఎం నవీన్ నామినేషన్
- వరుసగా 6వ గెలిచేందుకు ఉత్సాహం

భువనేశ్వర్:

గంజాం జిల్లా హింజిలికాట్ నియోజకవర్గం బిజూ జనతా దళ్ అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ రాజకీయ పుట్టినిల్లు. ఈ నియోజకవర్గం నుంచి ఆయన హ్యాట్రిక్ విజేతగా నిలుస్తున్నారు. ఈసారి గెలిస్తే దీర్ఘకాలిక ముఖ్యమంత్రిగా సరికొత్త రికార్డు నెలకొల్పే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఈసారి పోటీ ప్రాధాన్యత సంతరించుకుంది. హింజిలి అసెంబ్లీ స్థానం నుంచి ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ 6వ సారి మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. 6వ సారి ఈ స్థానం నుంచి తిరిగి ఎన్నిక కావాలని కోరుతూ ఈరోజు తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఆయనతో బిజూ జనతా దళ్ ప్రధాన ఎన్నికల వ్యూహకర్త వి.కార్తికేయ పాండియన్ భువనేశ్వర్ నుంచి ముఖ్యమంత్రితో కలిసి వచ్చారు. అసికా, బరంపురం లోక్‌సభ అభ్యర్థులతో పాటు, అసికా లోక్‌సభ పరిధిలోని మొత్తం 7 మంది ఎమ్మెల్యే అభ్యర్థులు, మంత్రి బిక్రమ్ కేశరి అరుఖ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. నవీన్ పట్నాయక్ హింజిలి నియోజకవర్గం నుంచి వరుసగా 5 సార్లు పోటీ చేసి రాష్ట్రశాసన సభకు ఎన్నికై ముఖ్యమంత్రిగా పాలనపగ్గాలు చేపట్టారు. 2000లో తొలిసారి ముఖ్యమంత్రిగా పోటీ చేసినప్పుడు హింజిలి నుంచి 65.35 శాతం ఓట్లు పోల్ కాగా, 2019లో అత్యధికంగా 76.04 శాతం ఓట్లు సాధించారు.

తరతరణి ఆశీర్వాదం

బరంపురం: దక్షిణ ఒడిశా ప్రజల ఆరాధ్య దైవం, రుశికుల్యా నదీతీరంలో కొండపై కొలువైన తరతరణి అమ్మవారిని నామినేషన్‌కు ముందు సీఎం నవీన్ పట్నాయక్ దర్శించుకున్నారు. దీనిలో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదం తీసుకున్నారు. సీఎం నవీన్‌తో పాటు వీకే పాండ్యన్ ఉన్నారు.



బరంపురం: తరతరణి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్



భువనేశ్వర్: నామినేషన్ పరిశీలిస్తున్న అధికారులు

పద్మశ్రీ మాగుణి చరణ్‌కు అస్వస్థత

భువనేశ్వర్: పద్మశ్రీ మాగుణి చరణ్ కుంవార్ అస్వస్థతకు గురయ్యారు. కెంజొహర్ ప్రాంతంలో ప్రముఖ తోలుబొమ్మలాటకారుడుగా గుర్తించి ఇటీవల భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయనకు ప్రతిష్టాత్మకమైన పద్మశ్రీ అవార్డును ప్రదానం చేశారు. ఆయన అస్వస్థతకు గురవ్వడంతో చికిత్స కోసం కెంజొహర్ జిల్లా ప్రధాన ఆస్పత్రిలో మంగళవారం చేర్చారు. రాష్ట్ర సంప్రదాయ తోలుబొమ్మల నృత్య కళ ప్రోత్సాహం, ప్రచారం చేయడంలో ఆయనకు అత్యున్నత పౌర పురస్కారం లభించింది. గత కొద్ది రోజులుగా ఆయన అనారోగ్యం బారినపడ్డారు. మంగళవారం ఉదయం మందులు వేసేందుకు తట్టినా స్పందన లేకపోవడంతో సత్వర ఉన్నత చికిత్స కోసం ఆస్పత్రికి తరలించినట్లు ఆయన కుమారుడు తెలిపాడు. వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు తట్టుకోలేని ఉక్కపోత, మందుల మోతాదు అధికం కావడంతో ఈ పరిస్థితి నెలకొందని తెలిపారు. ఇటీవల కాలంలో ఇరువురు కుమారులు మృతి చెందిన క్షోభతో ఆయన క్రమంగా కుంగిపోతున్నారని కోడలు తెలిపింది. 1937లో కెంజొహర్‌లో జన్మించిన మాగుణి చరణ్ కుంవార్ సంప్రదాయ తోలుబొమ్మల కుటుంబానికి చెందినవాడు. అతని తండ్రి బైష్ణబ్ చరణ్ కుంవార్ దగ్గర ఈ కళని అభ్యసించారు. ఈ కళ వ్యాప్తి, ప్రసారం కోసం దేశ, విదేశాలలో వివిధ సంస్థలు లఘు చిత్రాలు రూపొందించాయి. ఈ నేపథ్యంలో ఆయనకు గౌరవాలతో పాటు సంగీత నాటక అకాడమీ అవార్డు లభించింది.



చికిత్స పొందుతున్న చరణ్ కుంవార్

తొలి దశ ఎన్నికల బరిలో అభ్యర్థుల ఖరారు

- మే 13న పోలింగ్

భువనేశ్వర్: రాష్ట్రంలో తొలి దశ పోలింగ్‌కు అభ్యర్థులు ఖరారయ్యారు. ఈ దశలో పోటీ చేసేందుకు దాఖలైన నామినేషన్ల పరిశీలన అనంతరం పోటీ నుంచి కొంత మంది అభ్యర్థులు వైదొలిగారు. ఈ ప్రక్రియ అనంతరం బరిలో మిగిలిన అభ్యర్థులు ఖరారయ్యారు. ఈ నెల 13న తొలి దశ పోలింగ్ జరగనుంది. ఈ విడతలో 4 లోక్ సభ స్థానాలకు, వీటి పరిధిలో 28 శాసనసభ నియోజకవర్గాలకు పోలింగ్ నిర్వహిస్తారు. రాష్ట్రంలో మిగిలిన 17 పార్లమెంట్ స్థానాలకు ఈ నెల 20, 25, జూన్ 1 తేదీల్లో ఎన్నికలు జరగనున్నాయి.

బరిలో 37 మంది మాత్రమే..

4 లోక్ సభ స్థానాలకు తొలి దశలో 37 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఈ 37 మంది అభ్యర్థుల్లో 30 మంది పురుషులు, 7 మంది మహిళలు ఉన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయం సమాచారం ప్రకారం ఏప్రిల్ 26న అభ్యర్థుల నామినేషన్ పత్రాల పరిశీలన ముగించింది. అనంతరం సోమవారం వరకు పోటీ నుంచి వైదొలిగేందుకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు కల్పించింది. పరశీలన దశలో 38 మంది అభ్యర్థుల నామినేషన్ పత్రాలు చెల్లుబాటుగా ఎన్నికల సంఘం ప్రకటించింది. కొరాపుట్‌లో ఒక అభ్యర్థి సోమవారం తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. ఈ లెక్కన బరిలో చిట్టచివరగా 37 మంది మిగిలారు. కలహండి స్థానంలో 11 మంది, నవరంగ్‌పూర్‌లో 4, బరంపురం స్థానంలో 11, కొరాపుట్ నియోజకవర్గంలో 11 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు.

రూ.96.28 కోట్ల జరిమానా

భువనేశ్వర్: ఖుర్దా జిల్లా దామన్‌ఝుంయి ప్రాంతం కంకర రాళ్ల గనుల్లో అదనపు తవ్వకాలకు వ్యతిరేకంగా జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) భారీ జరిమానా విధించింది. పరిమితికి మించి తవ్వకాలు నిర్వహించినట్లు దాఖలైన పిటిషన్ విచారణ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఒక ప్రైవేట్ లీజుదారుడు పర్యావరణ పరిహారం కింద రూ.96.28 కోట్లు చెల్లించాలని జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశించింది. ఈ వివాదం నేపథ్యంలో ఏర్పాటు చేసిన సంయుక్త తనిఖీ కమిటీ సిఫార్సు మేరకు జరిమానా విధించినట్లు ఎన్‌జీటీ స్పష్టం చేసింది. టంగి తహసీల్ పరిధిలో ఉన్న కంకర రాళ్ల గనుల్లో లీజుకు మించి తవ్వకాలు చేయడం అక్రమ చర్యగా పేర్కొంటూ జంకియాకు చెందిన అజయ్ బెహెరా గత ఏడాది సెప్టెంబర్‌లో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను విచారించేందుకు కోల్‌కతాలోని ఈస్ట్ జోన్ బెంచ్ క్షేత్ర స్థాయి పరిశీలన కోసం సంయుక్త కమిటీని ఏర్పాటు చేసింది. లీజుదారుడు, టంగి తహసీల్దార్‌పై ఐపీసీ సెక్షన్‌లు 379, 420, 120బి, పర్యావరణ పరిరక్షణ చట్టం 1986లోని సెక్షన్ 19 కింద క్రిమినల్ చర్యలు చేపట్టేందుకు జిల్లా కలెక్టర్‌ను ఆదేశించాలని పిటిషనర్ ట్రిబ్యునల్‌కు అభ్యర్థించారు. గనుల తవ్వకాల అధికారి (ఖుర్దా), రాష్ట్ర పర్యావరణ ప్రభావం నిర్ధారణ అథారిటీ (ఎస్‌ఈఐఏఏ) శాస్త్రవేత్త, డిప్యూటీ డైరెక్టర్‌తో కూడిన కమిటీ సంయుక్తంగా తనిఖీ నిర్వహించి సిద్ధం చేసిన నివేదికను ట్రిబ్యునల్‌కు సమర్పించింది. ఈ నివేదికను ఎస్‌ఈఐఏఏ సభ్య కార్యదర్శి డాక్టర్ కై లాసం మురుగేషన్ దాఖలు చేసిన అఫిడవిట్‌తో పాటు సమర్పించారు. లీజుదారుడు గనుల అదనపు తవ్వకాలకు పాల్పడినట్లు నివేదికలో పేర్కొన్నారు. దాదాపు 64,254 ఘనపు మీటర్లు లోతుగా కంకర రాళ్ల తవ్వకాలకు పాల్పడినట్లు కమిటీ ధృవీకరించింది. ఈ చర్య పట్ల ప్రైవేట్ లీజుదారు నుంచి రూ. 96.28 కోట్ల పర్యావరణ పరిహారాన్ని వసూలు చేయాలని కమిటీ సిఫార్సు చేసింది. దీనిని అనుసరించి జస్టిస్ బి.అమిత్ స్తాలేకర్ (న్యాయ సభ్యుడు), డాక్టర్ అరుణ్ కుమార్ వర్మ (నిపుణుడు సభ్యుడు)లతో కూడిన జాతీయ హరిత ట్రిబ్యునల్ ధర్మాసనం ఈ కేసు విచారణను జూలై 5వ తేదీకి వాయిదా వేసినట్లు ప్రకటించింది. ఈలోగా వివరణ దాఖలు చేసేందుకు ప్రైవేట్ లీజుదారుకు అప్పటివరకు సమయం ఇచ్చినట్లు ధర్మాసనం పేర్కొంది.

కాసీపూర్‌లో నెక్కంటి ప్రచారం



కాసీపూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న నెక్కంటి తదితరులు

రాయగడ: కాసీపూర్‌లో బీజేడీ అధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావు మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మే 4వ తేదీన కాసీపూర్ సమితి టికిరిలో జరగనున్న ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ బహిరంగ సభలో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. అంతకుముందు ఆ పార్టీ సీనియర్ నాయకుడు, రాయగడ శాసనసభ నియోజకవర్గం ఎన్నికల ఇన్‌చార్జి కృష్ణ మహాపాత్రో కలిసి నాయకులతో సమావేశమై సభ విజయవంతం అయ్యేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

పక్కాగా ఎన్నికల వ్యయం నమోదు



ఎన్నికల ఖర్చులపై అభ్యర్థులు, ప్రతినిధులతో ఎన్నికల ముఖ్య అబ్జర్వర్ గంధం నాయుడు, ఎన్నికల వ్యయ అబ్జర్వరు చంద్రికా గార్గ్

- పరిశీలకులు చంద్రికాగార్గ్

పర్లాకిమిడి: ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల ఖర్చులను పక్కాగా నమోదు చేయాలని గంజాం, గజపతి జిల్లాల ఎన్నికల వ్యయపరిశీలకులు చంద్రికా గార్గ్ (ఐఈఏఆర్ఎస్) అన్నారు. గజపతి జిల్లాలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థులు, వారి ఏజెంట్లతో కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ మంగళవారం నిర్వహించారు. రిజిష్టర్‌లో ఎన్నికల వ్యయం నమోదుపై అవగాహన కల్పించారు. అలాగే బరంపురంలో రిటర్నింగ్ అధికారి, గంజాం జిల్లా అభ్యర్థులతో కూడా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి సందేహాలను నివృత్తి చేశారు. సమావేశంలో భారత ఎన్నికల కమిషన్ ద్వారా నియమించిన జిల్లా ముఖ్య ఎన్నికల పర్యవేక్షకులు గంధం నాయుడు, మోహనా రిటర్నింగ్ అధికారి బిరేంద్రకుమార్ దాస్, డీఆర్‌డీఏ అధికారి గుణనిధి నాయక్, పర్లాకిమిడి ఆర్వో అలోక్ పండా, తహసీల్దార్ నారాయణ బెహెరా, పలు పార్టీలకు చెందిన అభ్యర్థుల ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రతి అభ్యర్థి ఏజెంటు ఎన్నికల వ్యయాన్ని నామినేషను వేసిన నుంచి ఖర్చును వారికిచ్చిన రిజిష్టరులో పొందుపరిచి మే ఒకటో తేదీన బరంపురం దిగపహండి ఆర్వో కార్యాలయంలో అందజేయాలని చంద్రికా గార్గ్ అన్నారు. అభ్యర్థుల ఎన్నికల వ్యయపరిమితి రూ.40 లక్షలు కాగా.. అధికంగా ఖర్చు చేస్తే అభ్యర్థులపై తగు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

పర్లాకిమిడిలో అభిలాష్ పర్యటన

పర్లాకిమిడి: రాష్ట్ర బీజేపీ యువమోర్చా అధ్యక్షుడు అభిలాష్ పండా గజపతి జిల్లా పర్లాకిమిడిలో ఒక్కరోజు పర్యటనకు మంగళవారం విచ్చేశారు. ఆయనకు జిల్లా యువమోర్చా అధ్యక్షుడు బాలకృష్ణపాత్రో ఫారెస్టు గేటు వద్ద స్వాగతం పలికారు. అనంతరం పర్లాకిమిడి ఇరదల వీధిలోని బీజేపీ కార్యాలయంలో ఎమ్మెల్యే కె.నారాయణరావుతో భేటీ అయ్యారు. అనంతరం రాజవీధిలో జిల్లా యువమోర్చా అధ్యక్షుడు బాలకృష్ణ పాత్రో, ఇతర కార్యకర్తలతో సమావేశమయ్యారు. రానున్న ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. సమావేశంలో యువ ప్రభారీ ఆకాష్ సాహు, సాధారణ కార్యదర్శి అఖండల మణిగొడో, జిల్లా కోశాధ్యక్షుడు ప్రభాకర్ గురు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అభిలాష్ పండా

మహిళా సాధికారతకు పెద్దపీట



పాండ్యన్‌ను సత్కరిస్తున్న మహిళలు

- 5టీ ఛైర్మన్ వీకే పాండ్యన్

జయపురం: రాష్ట్రంలో సీఎం నవీన్ పట్నాయక్ మహిళా సాధికారతకు పెద్దపీట వేశారని 5టీ చైర్మన్ వీకే పాండ్యన్ అన్నారు. జయపురం సబ్ డివిజన్ కోట్‌పాడ్(ఎస్టీ) నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం నవీన్ పట్నాయక్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి వివరించారు. ముఖ్యంగా ప్రతీ గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించడంతో పాటు విద్యా, వైద్య సౌకర్యాలు, రహదారి సౌకర్యాలు మరింత మెరుగుపరచటానికి నవీన్ పట్నాయక్ కట్టుబడి ఉన్నారన్నారు. కోట్‌పాడ్ పట్టణంలో దమయంతి సాగర్, దేవాన్ ముండ చెరువుల ఆధునీకరణ చేపట్టడం జరుగుతుందని వెల్లడించారు. క్రీడా ప్రగతికి ఇండోర్ స్టేడియాలు నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి మాటల మనిషి కాదని, చేతల మనిషి అని కితాబిచ్చారు. రానున్న ఎన్నికల్లో శంఖం గుర్తుపై ఓటువేసి బిజూ జనతా దళ్ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కోట్‌పాడ్ బీజేడీ అభ్యర్థి చంద్రశేఖర మఝి, నవరంగపూర్ బీజేడీ ఎంపీ అభ్యర్థి ప్రదీప్ మఝి, కోట్‌పాడ్ సిట్టింగ్ ఎమ్మెల్యే పద్మిణీ దియాన్ తదితరులు పాల్గొన్నారు.



సభలో పాల్గొన్న ప్రజలు

మాకు ఓటు అడగొద్దు

- రాబుగుడ గ్రామ సరిహద్దులో బోర్డు ఏర్పాటు చేసిన స్థానికులు

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి దమునిపొంగ పంచాయతీ పరిధి రాబుగుడ గ్రామస్తులు వినూత్నంగా తమ నిరసనను వ్యక్తం చేస్తున్నారు. మౌలిక సౌకర్యాలు కల్పించలేని నాయకులు తమకు ఓటు అడిగే హక్కును కోల్పోయారని, అందువలన తమ గ్రామానికి వచ్చి ఓటు అడగవద్దని సూచిక బోర్డును గ్రామ సరిహద్దులో ఏర్పాటు చేశారు. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లు అయినా తమ గ్రామం కనీస అభివృద్ధికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు ఎన్నికలు రావడంతో ఇన్నేళ్లు పట్టించుకోని నాయకులు మరలా ఓట్లు కోసం వస్తున్నారన్నారు. అటువంటి వారికి బుద్ధి చెప్పేందుకు నిరసన తెలుపుతున్నామన్నారు.

మంత్రి జగన్నాథ సరక ప్రాతినిధ్యం...

రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ మంత్రి జగన్నాథ సరక ప్రాతినిధ్యం వహిస్తున్న బిసంకటక్ శాసనసభ నియోజకవర్గం పరిధిలోకి వస్తున్న రాబుగుడ గ్రామంలో సుమారు 500 మంది జనాభా నివసిస్తున్నారు. అంతా ఆదివాసీలే కావడంతో రెక్కాడితే డొక్కాడని జీవితాలు. వీరంతా కూలీ పనులు చేసుకుని ఉపాధి పొందుతుంటారు. గ్రామంలో ఉన్నటువంటి రెండు గొట్టపు బావుల్లో ఒకటి ఏడాది క్రితం మరామ్మతులకు గురవ్వడంతో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా గ్రామానికి సరైన రహదారి లేకపోవడంతో నానా అవస్థలు పడుతున్నామని వివరించారు. మౌలిక సమస్యలు పరిష్కరించాలని నాయకుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ఫలితం లేకపోయిందన్నారు. అందుకే ఈ ఎన్నికల్లో ఓట్ల కోసం వచ్చే నాయకులను గ్రామం లోపలికి రానివ్వకుండా పొలిమేరలోనే సూచిక బోర్డును ఏర్పాటు చేశామన్నారు. ఈ ఎన్నికలను తామంతా బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. ఒక వైపు జిల్లాలో 80 శాతం కంటే అధికంగా ఈ సార్వత్రిక ఎన్నికల్లో ఓటుహక్కును వినియోగించుకునేలా జిల్లా యంత్రాంగం చర్యలు చేపడుతుంటే, మరోవైపు ఇటువంటి తరహా గ్రామాల్లో ఎన్నికల బహిష్కరణ హెచ్చరికలు అధికారులకు సైతం తల నొప్పిని తెచ్చిపెడుతున్నాయి.



గ్రామ పొలిమేరలో బోర్డు ఏర్పాటు చేసిన దృశ్యం



ఎన్నికలను బహిష్కరిస్తామని హెచ్చరిస్తున్న గ్రామస్తులు

క్లుప్తంగా

ఎన్నికల అధికారులతో పరిశీలకుల సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న సౌరభ్ దూబె

పర్లాకిమిడి: బరంపురం పార్లమెంటరీ స్థానం ఎన్నికల ముఖ్య వ్యయ పర్యవేక్షకులు సౌరభ్ దూబె స్థానిక కలెక్టరేట్ కాన్ఫరెన్సు హాలులో పర్లాకిమిడి, మోహనా నియోజిక వర్గాల ఖర్చు పర్యవేక్షకులతో మంగళవారం మాట్లాడారు. సమావేశంలో దిగపహండి (గంజాం), పర్లాకిమిడి, మోహనా ఎన్నికల ఖర్చు పర్యవేక్షకులు చంద్రికా గార్గ్, డీఆర్‌డీఏ ఎన్నికల పర్యవేక్షకులు గుణనిధి నాయక్, ఛెలిగడ ప్రాజెక్టు స్వతంత్ర భూసేకరణ అధికారి రబీంద్ర కుహోరో, డిప్యూటీ కలెక్టర్ సరస్వతీ ముఖి, వాణిజ్యపన్నులు, జీఎస్టీ, ఇన్‌కాం ట్యాక్సు, అబ్కారీ, రాష్ట్ర రవాణా శాఖ, ఇతర స్క్వాడ్ అధికారులతో సౌరభ్ దూబెతో సమీక్షించారు. ఎన్నికల నిబంధనలు పక్కాగా అమలయ్యేలా చూడాలని ఆదేశించారు.

యువ ఓటర్లూ.. ఓటు హక్కును వినియోగించుకోండి



ఆహ్వాన పత్రికలను విడుదల చేస్తున్న కలెక్టర్ మహాజన్, ఇతర అధికారులు

రాయగడ: కొత్తగా ఓటరుగా చేరిన వారంతా ఈ నెల13వ తేదీన జరగనున్న ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని రాయగడ జిల్లా అధికారులు కోరారు. ఎన్నికల్లో పాల్గొనాలని కోరుతూ జిల్లా యంత్రాంగం ఆహ్వాన పత్రికలను మంగళవారం విడుదల చేసింది. జిల్లా కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్, సబ్ కలెక్టర్ కల్యాణి సంఘమిత్రాదేవి, జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వాహక అధికారి నిహారి రంజన్ కుహూరా తదితరులు జిల్లా పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాత్రికేయుల సమక్షంలో ఆహ్వాన పత్రికలను విడుదల చేశారు. జిల్లాలో 20,091 మంది కొత్తగా ఓటర్ల జాబితాలో చేరినట్టు కలెక్టర్ తెలిపారు. వారంతా 13వ తేదీ ఉదయం ఏడు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ జరగనున్న ఎన్నికల్లో తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

పొలం విషయమై తగాదా

● వ్యక్తి దారుణహత్య



పెరామ కూంజా మృతదేహం

మల్కన్‌గిరి: పొలం విషయమై ఇద్దరి మధ్య తలెత్తిన తగాదా ఒక నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. ఈ సంఘటన మల్కన్‌గిరి జిల్లా పోడియా సమితి బప్పన్‌పల్లి పంచాయితీ కుంజాగూడ గ్రామంలో సోమవారం రాత్రి చేసుకుంది. గ్రామానికి చెందిన గంగా మాడీ, పెరామ కుంజా మధ్య కొద్ది కాలంలో పొలం విషయమై గొడవలు జరుగుతున్నాయి. ఇదే విషయమై సోమవారం రాత్రి కూడా గొడవ జరిగింది. ఇద్దరి మధ్య మాటామాటా పెరగడంతో పెరామ కూంజా (40)ను గంగా మాడీ కత్తితో పీకకోసి హత్య చేశాడు. సమాచారం అందుకున్న పోడియ పోలీసులు మంగళవారం ఉదయం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కుంజా మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం పోడియ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. గంగాను అదుపులోకి తీసుకున్నారు. పోడియ ఐఐసీ రామేశ్వర్ ప్రధన్ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మానవత్వం పరిమళించిన వేళ..



సపర్యలు చేసిన అనంతరం మహిళతో పోలీసులు

నందిగాం: మతి స్థిమితం లేక జాతీయ రహదారిపై వెళ్తున్న ఓ మహిళను నందిగాం పోలీసులు సపర్యలు చేసి ఆదుకున్నారు. ఎస్పీ జి.రాధిక శ్రీకాకుళం నుంచి పలాస వైపు వెళ్తుండగా మార్గమధ్యలో నందిగాం మండలం పాలవలస వద్ద ఓ మహిళ మతి స్థిమితం లేకుండా జాతీయ రహదారిపై వెళుతుండటం గమనించి కారు ఆపారు. నందిగాం ఎస్సై మహమ్మద్ అమీర్ ఆలీకి ఫోన్ చేసి, పరిస్థితి వివరించి ఆమెకు కొత్త దుస్తులు అందజేయాలని ఆదేశించి కొంత సొమ్ము ఇచ్చారు. దీంతో నందిగాం ఏఎస్సై వరలక్ష్మీ, ఎస్సై సదరు మహిళలకు సపర్యలు చేసి కొత్త దుస్తులు ఇప్పించి భోజనం పెట్టారు. పోలీసుల ఔదార్యాన్ని స్థానికులు అభినందించారు.

మల్కన్‌గిరి అభివృద్ధి సీఎం నవీన్‌తోనే సాధ్యం

● 5టీ అధ్యక్షుడు వీకే పాండ్యన్



కలిమెల సభలో పాండ్యన్‌ను సత్కరిస్తున్న బీజేడీ కార్యకర్తలు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా అభివృద్ధి ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌తోనే సాధ్యమని అమో ఒడిశా–నవిన్ ఒడిశా, 5టీ అధ్యక్షుడు వీకే పాండ్యాన్ అన్నారు. మల్కన్‌గిరి జిల్లా కలిమెల, మత్తిలి సమితుల్లో మంగళవారం పర్యటించారు. కలిమెలలో నిర్వహించిన బహిరంగ సభలో పాండ్యాన్ మాట్లాడుతూ.. ఐదుసార్లు ముఖ్యమంత్రిగా పని చేసిన నవీన్‌పట్నాయక్ మరోసారి గెలుపుబాటలో ఉన్నారన్నారు. రాష్ట్ర ప్రజలకు కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ మల్కన్‌గిరి జిల్లా నుంచే సీఎం ప్రారంభించారని గుర్తు చేశారు. కిలో రూపాయి బియ్యం పథకం నుంచి ఆరోగ్య బీమా, హెల్త్ కార్డులు, లక్ష్మిబస్సు సేవలు, మల్కన్‌గిరి ప్రజాల కోసం ఏడు అంతస్తుల ప్రభుత్వాస్పత్రి భవనాన్ని ఇక్కడ నుంచే ప్రారంభించారని చెప్పారు. అలానే చిత్రకొండ సమితి కటాఫ్ ఏరియాలో గిరిజనుల అభివృద్ధికి గురుప్రియ వంతెనను ప్రారంభించి ఆ ప్రాంతాన్ని స్వాభిమాన్ ఏరియాగా మర్చామన్నారు. మల్కన్‌గిరి రాష్ట్రంలో 30వ జిల్లా అయినప్పటికీ ప్రతి అభివృద్ధి పథకాన్ని ఇక్కడ నుంచే ఆరంభిస్తున్నామన్నారు. 5టీను కూడా ఇక్కడ నుండే ప్రారంభినట్టు వివరించారు. ఇకో టూరిజాన్ని అభివృద్ధి చేశామన్నారు. అందులో భాగంగా మల్కన్‌గిరి సత్తిగూడ జలాశయాన్ని మరమ్మతులు చేసి చేసి ప్రకృతి అందాలతో కొన్ని అభివృద్ధి పరిచాం, చిత్రకొండలో పార్క్, జిల్లా జోదీగూడ శివ మందిరం వద్ద పార్క్, మల్లికేశ్వర్ కొండ వద్ద పార్క్ ఇలా చాలా అభివృద్ధి చేశామన్నారు. మల్కన్‌గిరిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన బీజేడీ ప్రభుత్వానికి అండగా నిలవాలని, రానున్న ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. నవరంగ్‌పూర్ ఎంపీ అభ్యర్థి ప్రదీప్ మాఝి, మల్కన్‌గిరి ఎమ్మెల్యే అభ్యర్థి మనాస్ మాడ్కామి, చిత్రకొండ ఎమ్మెల్యే అభ్యర్థి లక్ష్మీప్రియ నాయక్, అధికసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.



కలిమెల సభకు హాజరైన ప్రజలు



వేదికపై పాండ్యన్, బీజేడీ పార్టీ అభ్యర్థులు

ఓటు హక్కుపై అవగాహన



కళాకారులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న కలెక్టర్ కీర్తి వాసన్

జయపురం: స్వీప్ కార్యక్రమం ద్వారా ఓటు హక్కుపై అవగాహన కల్పించేందుకు కొరాపుట్ జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా ఎన్నికలపై ప్రజలను చైతన్యపరచే కార్యక్రమానికి జయపురంలో శ్రీకారం చుట్టిన విషయం విదితమే. ఈ కార్యక్రమాల్లో వివిధ పాఠశాలల విద్యార్థులు, యువతీ, యువకులు 8 బృందాలుగా ఏర్పడి జిల్లాలో వివిధ ప్రాంతాలలో ప్రదర్శనలు ఇస్తూ ఓటు హక్కుపై అవగాహన కల్పించటం జరుగుతుందని అధికారులు తెలిపారు. జిల్లా కలక్టర్ వి.కీర్తి వాసన్ మాట్లాడుతూ 'ఓటు వేసి జిల్లా, దేశ నిర్మాణంలో భాగస్వాములు కండి' అని పిలుపునిచ్చారు. ఈ అవగాహన కార్యక్రమాల్లో ఎలక్షన్ అధికారులు, పర్యవేక్షకులు పాల్గొన్నారు.



ఓటు వేసి జిల్లా, దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిస్తున్న అధికారి



వివిధ జాతుల వస్త్రధారణల్లో వచ్చి ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న బాలికలు



స్వీప్ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు



సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొంటున్న కళాకారులు



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న కళాకారులు, ప్రజలు

బీజేడీ అభ్యర్థుల విజయం ఖాయం



మైనార్టీ నాయకులతో మాట్లాడుతున్న మంత్రి సవ్యసాచి నాయక్



సమావేశంలో పాల్గొన్న మైనార్టీలు

పర్లాకిమిడి: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో గజపతి జిల్లాలోని పర్లాకిమిడి, మోహానా అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీజేడీ పార్టీ అభ్యర్థులు రూపేష్ పాణిగ్రాహి, అంతర్యామి గోమాంగోలు విజయం ఖాయమని పార్టీ జిల్లా ఎన్నికల పరిశీలకులు, రాష్ట్ర సహకార సంఘాల మంత్రి అతాను సవ్యసాచి నాయక్ ధీమా వ్యక్తం చేశారు. స్థానిక బీజేడీ పార్టీ కార్యాలయంలో అసెంబ్లీ నియోజికవర్గాల సమీక్ష, మైనార్టీ సెల్ నాయకులతో సమీక్ష సమావేశాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని మైనారిటీ సెల్ ప్రతినిధులకు సూచించారు. సమావేశంలో పాల్గొన్న మాజీ ఎంపీ మున్నాఖాన్ మాట్లాడుతూ.. ముస్లింలు, క్రిస్టియన్లు బీజేడీతోనే ఉంటారన్నారు. సమావేశంలో పురపాలక అధ్యక్షురాలు నిర్మలా శెఠి, కాశీనగర్ ఎన్ఏసీ ఉపాధ్యక్షులు రఘురాం సాహు, బసంత్ దాస్, పర్లాకిమిడి బీజేడీ అభ్యర్థి రూపేష్ పాణిగ్రాహి, క్రిస్టియన్ సంఘం అధ్యక్షులు పల్లబ్ లిమ్మా ఉన్నారు.



మాట్లాడుతున్న పర్లాకిమిడి బీజేడీ అభ్యర్థి రూపేష్

ఏఓబీలో 22,300 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



స్వాధీనం చేసుకున్న సామగ్రితో పోలీసు బలగాలు

మెళియాపుట్టి: మండలంలోని ఏఓబీ సరిహద్దు భరణికోట పంచాయతీ మర, బాలేరు, ఒడిశాలోని మర్రిగుడ్డి, కొయ్యార గ్రామాల్లో సారా తయారీ స్థావరాలపై మంగళవారం ఈఎస్ తిరుపతినాయుడు, ఏఈఎస్ ఐ.ఎ.బేగం ఆధ్వర్యంలో టెక్కలి, పలాస డీటీఎఫ్, ఎస్ఈబీ, ఇంటెలిజెన్స్ బృందాలు మెళియాపుట్టి పోలీసుల సహకారంతో దాడులు నిర్వహించారు. 22,300 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసి 500 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. శ్రీకాకుళం ఎస్ఈబీ జేడీ గంగాధరం సూచనల మేరకు దాడులు నిర్వహించినట్లు సిబ్బంది తెలిపారు. ఈ దాడుల్లో సీఐలు రామచంద్ర కుమార్, రాజశేఖర్ నాయుడు, మెళియాపుట్టి ఎస్సై రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నది మధ్యలో యువకుడు ఆత్మహత్య

గార: మండలంలోని శాలిహుండం–పూసర్లపాడు గ్రామాల పరిధిలో వంశధార నది మధ్య ఓ చెట్టుకు ఉరి వేసుకుని గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది. మంగళవారం మధ్యాహ్నం నదిలో చేపలు పట్టేవాళ్లు చెట్టుకు ఉన్న మృతదేహాన్ని చూసి వీఆర్‌వో పాపారావుకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి వివరాలు తెలియకపోవడంతో సోషల్ మీడియా ద్వారా ఆరా తీస్తున్నారు. తెలిసిన వారు గార పోలీస్‌స్టేషన్‌కు సంప్రదించాలని ఎస్సై కె.కృష్ణ ప్రసాద్ కోరారు.

మునిగుడలో కాంగ్రెస్ భారీ ర్యాలీ



మునిగుడలో ప్రసంగిస్తున్న సప్తగిరి



ర్యాలీలో పాల్గొన్న సప్తగిరి, హికక, నాయకులు

రాయగడ: జిల్లాలోని మునిగుడలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించారు. కొరాపుట్ లోక్‌సభ నుంచి పోటీ చేస్తున్న సప్తగిరి శంకర్ ఉలక, బిసంకటక్ శాసనసభ నుంచి పోటీ చేస్తున్న నీలమాధవ హికక, పార్టీ నాయకులు ర్యాలీలో పాల్గొన్నారు. మునిగుడలో పార్టీ కార్యాలయాన్ని సప్తగిరి ప్రారంభించారు. భైరవగుడ, శివపాడొరొ, హటొదహికల్, పాత్రగుడ, అమ్లాభట్ట పంచాయతీల్లో పర్యటించారు. ఆయనకు జనాలు నీరాజనాలు పలికారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే జనహిత కార్యక్రమాలతోపాటు మౌలిక సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. పలు ప్రాంతాల్లో రోడ్డు షోలు నిర్వహించారు.

5 క్వింటాళ్ల గంజాయి పట్టివేత



అరెస్టయిన నిందితులు, స్వాధీనం చేసుకున్న నగదు

● నలుగురు అరెస్టు

మల్కన్‌గిరి: గంజాయి రవాణా గుట్టురట్టయింది. పోలీసులు నిఘా వేసి గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారిని పట్టుకొని వారి వద్ద నుంచి ఐదు క్వింటాళ్లకుపైగా గంజాయిని స్వాధీనం చేసుకొని నలుగురిని అరెస్టు చేశారు. మల్కన్‌గిరి జిల్లా బలిమెల పోలీసు ఐఐసీ సుమాన్ పట్నాయక్‌కు ముందస్తుగా వచ్చిన సమాచారం మేరకు కొరుకొండ సమితి నీలాకంబేర్ పంచాయతీ చిత్రకొండ ఘట్టీలోని గణేష్ దేవాలయం రహదారిలో మంగళవారం ఉదయం పోలీసులు నిఘా వేశారు. వాహానాలను తనిఖీ చేస్తుండగా.. ఓ ఆటోలో అక్రమంగా గంజాయిని తరలిస్తున్న విషయం వెలుగు చూసింది. ఆటో వెనకాలే ద్విచక్ర వాహనంపై వస్తున్న వారిని ఆపి విచారించగా గంజాయి రవాణాకు చెందిన వారిగా తేలింది. దీంతో నలుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 30 వేల నగదు, మూడు సెల్‌ఫోన్లు, ఆటో, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి 525 కిలోలు ఉన్నట్టు పోలీసులు తెలిపారు. దీని విలువ 50 లక్షల రూపాయలు ఉంటుందన్నారు. అరెస్ట అయిన వారిలో చిత్రకొండ సమితికు చెందిన జగన్నాథ్‌ఖిలో, జగత్రాగ్, బసంత్ ముదిలి, సుభాష్ కిర్సనీలు ఉన్నారన్నారు. వీరిని మల్కన్‌గిరి కోర్టులో హాజరు పరిచినట్టు ఐఐసీ సుమాన్ పట్నాయక్ తెలిపారు.

జోరుగా.. నామినేషన్లు

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి రాష్ట్రంలో మరో విడత పోలింగ్‌కు మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున నామినేషన్లు దాఖలయ్యాయి. అభ్యర్థులు తమ మద్దతుదారులతో ర్యాలీగా వెళ్లి నామినేషన్ పత్రాలను అధికారులకు సమర్పించారు. వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులు ప్రత్యేక పూజలు నిర్వహించి నామినేషన్లు వేసేందుకు బయల్దేరారు. వారితో పాటు ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు.

– సాక్షి నెట్‌వర్క్



భువనేశ్వర్: నామినేషను దాఖలు చేస్తున్న రణేంద్ర ప్రతాప్ స్వంయి



భువనేశ్వర్: అరొగొడొ నియోజకవర్గం బీజేడీ అభ్యర్థి రణేంద్ర ప్రతాప్ స్వంయి బైక్ ర్యాలీ



భువనేశ్వర్: పూరీ పార్లమెంటరీ నియోజకవర్గానికి నామినేషన్ దాఖలు చేస్తున్న బీజేపీ అభ్యర్థి డాక్టర్ సంబిత్ పాత్రో



భువనేశ్వర్: బొలంగీర్ లోక్‌సభ స్థానం నుంచి నామినేషన్ దాఖలు చేస్తున్న బీజేపీ అభ్యర్థి సంగీత కుమారి సింగ్‌దేవ్



భువనేశ్వర్: కెంజొహర్ జిల్లాలో ఆనందపూర్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి అలోక్ సెరి ఊరేగింపు



భువనేశ్వర్: బీజేడీ అభ్యర్థిగా సంబలపూర్ లోక్‌సభ స్థానం నుంచి పోటీకి నామినేషన్ దాఖలు చేస్తున్న ప్రణబ్ ప్రకాష్ దాస్



భువనేశ్వర్: రౌర్కెలా శాసనసభ స్థానం నుంచి పోటీకి బీజేపీ అభ్యర్థిగా నామినేషను దాఖలు చేస్తున్న దిలీప్ రాయ్



భువనేశ్వర్: రౌర్కెలాలో దిలీప్ రాయ్ నామినేషన్ దాఖలు ఊరేగింపుతో కిక్కిరిసిన వీధులు



భువనేశ్వర్: లొయిసింగ అసెంబ్లీకి బీజేపీ అభ్యర్థిగా గోపాల్‌జీ పాణిగ్రాహి నామినేషన్ దాఖలు



భువనేశ్వర్: బొలంగీరు బీజేపీ అభ్యర్థిగా ముఖేష్ మహాలింగ్ నామినేషన్



బరంపురం: సన్నోఖెముండి కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలుచేస్తున్న రమేష్ చంద్ర జన్నా

క్లుప్తంగా

సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా అప్పలనాయుడు


డాక్టర్ అప్పలనాయుడు

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ సంబంగి అప్పలనాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు వైద్య విద్య సంచాలకులు ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సూపరింటెండెంట్‌గా పని చేసిన డాక్టర్ అనిలాసునందని పదవీ విరమణ పొందారు.

జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు కళ్యాణి



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన కళ్యాణిని అభినందిస్తున్న కళాశాల సిబ్బంది

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి ఎస్డీఎస్ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం కంప్యూటర్ సైన్సు చదువుతున్న రేణుక కళ్యాణి 84 కిలోల పవర్ లిఫ్టింగ్ విభాగంలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఇటీవల ఆంధ్ర విశ్వవిద్యాలయం స్థాయిలో జరిగిన పోటీల్లో ఈ విద్యార్థిని ప్రతిభ చాటింది. మే నెల 18న తమిళనాడులో జరగబోయే అంతర జాతీయ ఇంటర్ విశ్వవిద్యాలయం పోటీల్లో ఆంధ్ర విశ్వవిద్యాలయం తరపున పాల్గొని సత్తాను కనబరచనుంది. కళ్యాణిని పీడీ బి.శ్రీను, సెక్రటరీ బి.రవి, హెచ్‌ఓడీ డా.బాలభారతి తదితరులు అభినందించారు.

మహిళ ఆత్మహత్య

భోగాపురం: మండలంలోని అప్పన్నపేట గ్రామానికి చెందిన వనుం నరసమ్మ(36) మనస్తాపంతో సోమవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడింది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు.. నరసమ్మ భర్త సన్యాసిరావు ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. సన్యాసిరావు విధులు ముగించుకుని సోమవారం రాత్రి ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో భార్య అన్నం, కూర వండి చారు చేయకపోవడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో ఒకరిపై ఒకరు అలిగి ఎవరు భోజనం చేయలేదు. దీంతో మనస్తాపం చెందిన నరసమ్మ సోమవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సుందరపేట సీహెచ్‌సీకి తరలించారు. మృతురాలి కూమార్తె పీత సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సూర్యకుమారి తెలిపారు.

శిక్షణతో ఉపాధి

విజయనగరం అర్బన్: శిక్షణ తరగతుల్లో నేర్చుకున్న నైపుణ్యాన్ని ఉపాధి కల్పనకు సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ నోడల్ అధికారి డి.సుబ్రహ్మణ్యం అన్నారు. జీఎంఆర్ వరలక్ష్మి ఉపాధి శిక్షణ కేంద్రంలో మంగళవారం జరిగిన శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక నైపుణ్యాన్ని మెరుగుపరుచుకుంటే మంచి ఉపాధి అవకాశాలు లభిస్తాయని సూచించారు. జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్ అందించిన విద్యుత్ పరికరాలను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్ అసోసియేట్ మేనేజర్ నాగరాజు, సెంటర్ ఇన్‌చార్జి కేవీరమణ పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో సత్తాచాటిన క్రీడాకారులు

తెర్లాం: జాతీయ స్థాయి జూనియర్స్ సౌత్ జోన్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లాకు చెందిన తొమ్మిది మంది క్రీడాకారులు అత్యుత్తమ ఆటతీరును కనబరిచి జాతీయ స్థాయిలో ఏపీ బాలురు, బాలికల జట్లు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించేందుకు తమ సత్తాను చాటారు. కర్నాటక రాష్ట్రంలోని తుముకూర్‌లో ఈ నెల 27 నుంచి జాతీయ స్థాయి జూనియర్స్ సౌత్‌జోన్ సాఫ్ట్‌బాల్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బాలుర జట్టు ప్రథమ స్థానం సాధించగా, బాలకల జట్టు ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ పోటీల్లో జిల్లాకు చెందిన తొమ్మిది మంది క్రీడాకారులు రాష్ట్ర జట్లలో ప్రాతినిధ్యం వహించారు. వీరంతా ఫైనల్ పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి ఏపీ జట్లకు విజయాన్ని అందించారు. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్న ఏపీ బాలుర జట్టులో జిల్లాకు చెందిన కె.వేణు, కె.రోహిత్, జి.జశ్వంత్, సీహెచ్ శ్యామ్‌కుమార్, కె.రాఘవ, బాలికల జట్టులో ఎ.తేజ, పి.చైతన్యకుమారి, కె.అఖిల, ఎ.భవనేశ్వరి ప్రాతినిధ్యం వహించారు. జిల్లా క్రీడాకారులను సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి నాగేంద్ర, సీఈఓ వెంకటేశ్వరరావు, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, పలువురు పీడీలు, పీఈటీలు అభినందించారు.

నాడు దుర్భిక్షం..
నేడు సస్యశ్యామలం

- టీడీపీ హయాంలో కరువుతో ఇబ్బంది పడ్డ రైతులు
- వరుసగా నాలుగేళ్లు కరువు
- అధికారిక లెక్కల ప్రకారం 11,868 హెక్టార్లలో పంట నష్టం
- జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సమృద్ధిగా పంటలు


కరువు కారణంగా విజయనగరం మండలం రాకోడు గ్రామంలో ఎండిపోయిన వరి పంట (ఫైల్)

విజయనగరం ఫోర్ట్: రాష్ట్రంలో టీడీపీ అధికారంలో ఉన్న 2014 – 2019 మధ్య కాలంలో రైతులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. వరుస కరువు పరిస్థితుల కారణంగా తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయి. పంటలు పండక తిండి గింజలకు కూడా రైతులు అవస్థలు పడ్డారు. ఐదేళ్ల కాలంలో ప్రతీ ఏటా విపత్తుల సంభవించడంతో రైతులు కోట్లాది రుపాయిలు నష్టపోయారు. అయితే అతివృష్టి లేదా అనావృష్టి సంభవించి పంటలకు నష్టం వాటిల్లింది. దీంతో రైతులు కోలుకోలేని తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయారు. వరుస విపత్తుల వల్ల జరిగిన పంట నష్టానికి రైతులకు చెల్లించాల్సిన పరిహారంగాని ఇన్‌పుట్ సబ్సిడీగాని రైతులకు చంద్రబాబు సర్కార్ సకాలంలో చెల్లించలేదు. రైతులు మరింత ఇబ్బంది పడ్డారు.

బీభత్సం సృష్టించిన హుద్‌హుద్

రాష్ట్రంలో ఎన్నడూ చూడని విధంగా తీవ్ర బీభత్సం సృష్టించించిన హుద్‌హుద్ తుఫాన్ చంద్రబాబు అధికారం చేపట్టిన మూడు నెలలకే సంభవించింది. ఇది సృష్టించిన బీభత్సం అంతా ఇంతా కాదు. ఉత్తరాంధ్ర కకావికాలం అయింది. ఈ గాయం నుంచి ఇంకా పూర్తి స్థాయిలో జనం తేరుకోలేదు. దీని వల్ల అధిక మొత్తంలో పంట నష్టంతో పాటు విద్యుత్ వ్యవస్థకు తీవ్ర నష్టం వాటిల్లింది.

వరుసగా నాలుగేళ్లు కరువు

టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో వరుసగా నాలుగేళ్లు కరువు ఏర్పడింది. 2014 నుంచి 2018 వరకు కరువు ఏర్పడింది. వేలాది ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లింది. 2015లో కరువు వల్ల 708.65 హెక్టార్లలో పంటకు నష్టం వాటిల్లింది. 2016లో కరువు వల్ల 2,173.04 హెక్టార్లలో, 2017లో కరువు వల్ల 69.36 హెక్టార్లలో పంటకు నష్టం వాటిల్లింది. 2018 ఖరీఫ్‌లో ఏర్పడ్డ కరువు వల్ల 8,918 హెక్టార్లలో పంటకు నష్టం వాటిల్లింది. మొత్తంగా నాలుగేళ్లలో 11,869.77 హెక్టార్లలో పంటలకు నష్టం వాటిల్లింది.

2015 నుంచి 2018 వరకు జరిగిన పంట నష్టం వివరాలు

సంవత్సరం	పంట నష్టం (హెక్టార్లలో..)	రైతులు	నష్టం విలువ (రూ.కోట్లలో..)
2015	708	2877	3.06
2016	2,173	7743	1.06
2017	69.36	461	0.06
2018 ఖరీఫ్	8918	24,320	13.37

జగన్ పాలనలో సస్యశ్యామలం

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఐదేళ్ల పాటు రాష్ట్రంతో పాటు జిల్లా సస్యశ్యామలంగా ఉంది. వర్షాలు ఆశించిన స్థాయిలో పడడంతో పంటలు సమృద్ధిగా పండాయి. ఐదేళ్లలో కరువు పరిస్థితి లేదు. దీంతో రైతులంతా వైఎస్సార్ మాదిరి, జగన్ మోహన్‌రెడ్డి పాలన కూడా రామరాజ్యాన్ని తలపించిందని సంతోషిస్తున్నారు. రైతులు పండించిన పంటను ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసి మద్దతు ధర రైతులకు కలిగించింది. పంట పెట్టుబడికి ప్రభుత్వం వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.13,500 చొప్పున సాయం అందిస్తోంది. దీంతో రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసుకుని వ్యవసాయాన్ని కష్టంగా కాకుండా ఇష్టంగా చేస్తున్నారు.


జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పండిన వరి పంట (ఫైల్)

జగన్ పాలనలో సస్యశ్యామలం



సీఎం జగన్ పాలన బాగుంది. ఐదేళ్ల పాటు వర్షాలు బాగా కురిసాయి. ఐదు సంవత్సరాలు పంటలు బాగా పండాయి. పంటలు సస్యశ్యామలమయ్యాయి. సాగునీటి కోసం ఏ రోజూ ఇబ్బంది పడలేదు. చంద్రబాబు పాలనలో కరువు వల్ల ప్రతి సంవత్సరం పంట ఎండిపోయేది. నీరు తోడుకుందామన్నా చెరువుల్లో నీరు లేని పరిస్థితి.

– రంధి నాగేశ్వరరావు, రైతు, పెదవేమలి గ్రామం

ఆకట్టుకున్న ఎలక్ట్రానిక్స్ ఎగ్జిబిషన్


ఎగ్జిబిషన్ డిజైన్‌లను పరిశీలిస్తున్న జెఎన్‌టీయూ జీవీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.గురునాథ్

విజయనగరం అర్బన్: గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో 'ఎంబెడ్డెడ్ సిస్టమ్స్ అండ్ ఐఓటీ'లను అనుసరించి మంగళవారం ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్స్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. విద్యార్థులు నూతన ఆవిష్కరణలతో రూపొందించిన 20 డిజైన్లను ప్రదర్శనలో ఉంచారు. ప్రదర్శనలను జేఎన్‌టీయూ జీవీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.గురునాథ్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ.. కొత్త రంగాలలో అభివృద్ధి దిశగా ప్రయత్నాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ టీడీవీఏ నాయుడు, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

- ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలీల


అనిలాసునందనిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలీల

విజయనగరం ఫోర్ట్: అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు లభిస్తుందని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. పద్మలీల తెలిపారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో పనిచేసి పదవీ విరమణ పొందిన డాక్టర్ అనిలాసునందనిని సహచర వైద్యులు మంగళవార సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అనిలాసునందని చిత్తశుద్ధితో విధులు నిర్వహించారన్నారు. అందరితో స్నేహపూర్వకంగా మెలిగేవారని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్లు పీఏ రమణి, అజయ్‌కుమార్, ఆర్ఎంఓ ఎన్.సురేష్‌బాబు, సంబంగి అప్పలనాయుడు, వైద్యులు బి.అజయ్ కుమార్, ప్రసాద్, బి.సంతోష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పీవీజీ ఆశయ సాధనకు కృషి చేయాలి


మాట్లాడుతున్న మాన్సాస్ విద్యాసంస్థల చైర్మన్ పూసపాటి అశోక్ గజపతిరాజు

విజయనగరం టౌన్: విద్యల నగరమైన విజయనగరంలో విద్యాభివృద్ధికి కృషిచేసిన మహనీయుడు డాక్టర్ పీవీజీ రాజు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని మాన్సాస్ విద్యా సంస్థల చైర్మన్ పూసపాటి అశోక్ గజపతిరాజు అన్నారు. స్థానిక కోటలో ఉన్న ఓపెన్ ఆడిటోరియంలో పీవీజీ వందేళ్ల జయంతి వేడుకలను మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీవీజీ కృషికి అర్థాన్నిచ్చేలా పని చేయాలన్నారు. ఇప్పటివరకు చేసిన తప్పులను పక్కనపెట్టి అభివృద్ధి దిశగా అడుగులు వేయాలని సూచించారు. కార్యక్రమంలో సునీలా గజపతిరాజు, విద్యావతీదేవీ, అదితి గజపతి, కరస్పాండెంట్ డాక్టర్ కేవీఎల్.రాజు, డాక్టర్ ఏవీడీ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలి..

- ప్రత్యేక హోదా విభజన హామీల సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్


మాట్లాడుతున్న ప్రత్యేక హోదా విభజన హామీల సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్

విజయనగరం అర్బన్: ప్రత్యేక హోదా ఇవ్వని కేంద ప్రభుత్వాన్ని నిలదీయాలని ప్రత్యేక హోదా విభజన హామీల సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ అన్నారు. మంగళవారం స్థానిక గురజాడ పబ్లిక్ స్కూల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఉత్తరాంధ్ర ప్రాంతం వెనుకబాటుతనాన్ని పారద్రోలే పాలకులు రావాల్సిన అవసరం ఉందని, అటువంటి వారినే ఓటర్లు ఎన్నుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం తోలుబొమ్మలాటను మానుకుని ఉత్తరాంధ్ర, రాయలసీమకు ఇవ్వాల్సిన ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని.. ఈ విషయమై అభ్యర్థులు నిలదీయాలన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక హోదా విభజన హామీల సాధన సమితి ప్రతినిధి పి.బుల్లిరాజు, ఆంధ్రా ఇంటలెక్చువల్స్ ఫోరం అధ్యక్షుడు ప్రొఫెసర్ అప్పలనాయుడు, డాక్టర్ జశ్వంత్‌నాయుడు, డాక్టర్ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



నృత్యం చేస్తున్న నర్తనశాల అకాడమీ విద్యార్థినులు

విజయనగరం టౌన్: నగరంలోని మూడులాంతర్లు వద్దనున్న చదురుగుడి ఆవరణలో ప్రతి వారం నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమంలో భాగంగా నర్తనశాల డ్యాన్స్ డైరెక్టర్ డాక్టర్ భేరి రాధికారాణి శిష్యబృందం మంగళవారం రాత్రి ప్రదర్శించిన భరతనాట్య నృత్యప్రదర్శన ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకుంది. అదేవిధంగా కళా రవి పైడితల్లి అమ్మవారి పాట, ప్రవచనాలను వివరించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ప్రసాదరావు, సూపర్ వైజర్లు ఏడుకొండలు, బంటుపల్లి వెంకటరావు, శ్రీనివాసరాజు, ఆర్.సూర్యపాత్రో, తదితరులు పాల్గొన్నారు.

• పుష్పాలంకరణలో పైడితల్లి

ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, నేతేటి ప్రశాంత్, మూలా పాపారావులు శాస్త్రోక్తంగా చదురుగుడి, వనంగుడిలలో పూజలు చేశారు. ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు మజ్జిగ అందజేశారు.

– విజయనగరం టౌన్


పుష్పాలతో అలంకరించిన అమ్మవారు


భక్తులకు ఉచితంగా మజ్జిగ అందజేస్తున్న సేవకులు

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం


ఆర్అండ్‌బీ వద్ద మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆర్యవైశ్య సేవా సంఘ ప్రతినిధులు

విజయనగరం టౌన్: శ్రీవాసవీ ఆర్యవైశ్య సేవా సంఘం కంటోన్మెంట్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఆర్ అండ్‌బీ జంక్షన్ బస్టాప్ వద్ద మంగళవారం మజ్జిగ చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు ముమ్మడిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ, వేసవితాపం ఎక్కువగా ఉన్నందున ప్రతిఒక్కరూ జాగ్రత్తలు పాటించాలన్నారు. బయటకు వచ్చే వారు తప్పనిసరిగా టోపీ ధరించాలని, లేనిపక్షంలో గొడుగు వినియోగించాలని సూచించారు. అలాగే నిమ్మరసం, మంచినీరు, పళ్లరసాలు, కొబ్బరి నీరు ఎక్కువగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిమ్స్ రాజు, కోశాధికారి త్రినాథ్, కొల్లా సాయిరాజు, వద్దాది ఈశ్వరరావు, ఉప్పల కాశీ, కేవీ శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన


ఉచిత వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

విజయనగరం: పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ప్రముఖ జ్యోతిష్య వాస్తు సిద్ధాంతి వెంకట వరప్రసాద్ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవ సేవే మాధవ సేవ అని తెలిపారు. వైద్యులు ఎం. ప్రవీణ్ కుమార్, ఎ. వివేక్ సుమారు 200 మంది రోగులను పరీక్షించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ చైర్మన్ పెంటపాటి ముత్యాలు, దేవాలయం కమిటీ చైర్మన్ విజయరామయ్య, కన్వీనర్ కామరాజు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలపై చంద్రబాబుది కపట ప్రేమ

- వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రేగాన

నెల్లిమర్ల రూరల్: ఎస్సీ, ఎస్టీలపై మాజీ ముఖ్యమంత్రి కపట ప్రేమ కనబరుస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు అన్నారు. మండలంలో సీతారామునిపేటలో మంగళవారం ఆయన మాట్లాడుతూ...గతంలో ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన హామీలన్నింటినీ చెత్తబుట్టలో వేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు మళ్లీ ఇప్పుడు కపటప్రేమ కనబరుస్తున్నాడని ఆరోపించారు. ఆయన ప్రకటించిన మేనిఫెస్టో అంతా బూటకమన్నారు. చంద్రబాబు హామీలను ప్రజలను నమ్మే పరిస్థితి లేదన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


మరుపల్లి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

గజపతినగరం రూరల్: మండలంలోని మరుపల్లి, మర్రివలస గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఎన్నికల పరిశీలకులు హనీష్ చాబ్రా మంగళవారం పరిశీలించారు. కేంద్రాల్లో పూర్తిస్థాయి సదుపాయాలు కల్పించేలా దృష్టి సారించాలని ఆర్ఓ సూర్యకళకు సూచించారు. ఓటర్లకు అందుబాటులో తాగు నీరు, వైద్యసదుపాయంతో పాటు నీడ కోసం టెంట్లు ఏర్పాటు చేయాలని చెప్పారు.ఆయన వెంట తహసీల్దార్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గడ్డి వాములు దగ్ధం


మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

బొండపల్లి: మండలంలోని దేవుపల్లి గ్రామంలో మంగళవారం సాయంత్రం సంభవించిన అగ్ని ప్రమాదంలో ఇద్దరు రైతులకు చెందిన గడ్డి వాములు దగ్ధమయ్యాయి. రైతులు గంటా వీరప్ప, కొర్రాయి సూర్యనారాయణకు చెందిన గడ్డివాములకు తొలుత మంటలు వ్యాపించాయి. స్థానికులు గజపతినగరం అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. పక్కనే గల మిగతా గడ్డి వాములకు మంటలు వ్యాపించకుండా చేశారు. రైతులకు సుమారు రూ.20 వేల నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక అధికారి ఎం.ఎస్.వి.రవి ప్రసాద్ తెలిపారు.

ఓటేద్దాం..


అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

జామి: ప్రజల తలరాతను నిర్దేశించే శక్తివంతమైన ఆయుధం ఓటు అని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించు కోవాలని కళాజాత బృందం సూచించింది. మండల కేంద్రం జామిలో డీడీ సునీత ఆధ్వర్యంలో ఎస్ఈఈపీ (సిస్టమా టిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్, ఎలక్ట్రోరల్ పార్టిసిపేషన్) కార్యక్రమంపై ప్రజలకు కళాజాత బృంద సభ్యులు మంగళవారం అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

చల్ల..చల్లగా..

జామి: మండలంలోని బలరాంపురం గ్రామ జంక్షన్ వద్ద గ్రామ హనుమాన్ యూత్ సేవా సంఘం ఆధ్వర్యంలో పాదచారులు, ప్రయాణికులకు మంగళవారం మజ్జిగ పంపిణీ చేశారు. ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో ప్రయాణికులు, పాదచారుల దాహార్తి తీర్చేందుకు మజ్జిగ పంపిణీ చేశామని నిర్వాహకులు తెలిపారు.

వృద్ధాశ్రమానికి వితరణ

చీపురుపల్లి: పట్టణంలోని బాపూజీ వృద్ధాశ్రమంలో నిత్యాన్నదాన పథకం నిర్వహణకు గాను మండలంలోని ఇటకర్లపల్లి గ్రామానికి చెందిన మీసాల శ్రీనివాసరావు రూ.11 వేలు అందజేశారు. ఈ మేరకు వృద్ధాశ్రమంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకుడు కోట్ల లక్ష్మణరావుకు నగదు అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ, తమ గ్రామానికి చెందిన గొర్లె నారాయణమ్మ ఆమె భర్త వెంకటరమణ వర్ధంతి సందర్భంగా నగదు అందజేసినట్లు చెప్పారు.